# మరికొంత

తోట పద్మావతి

"వసూ! నా కోసం నువ్విలా కష్టపడటం నాకు చాలా బాధగా వుంది. నన్ను క్షమించు వసూ!" అంటూ ఆవేదనగా వసంత చేతులు పట్టుకున్నాడు మూర్తి.

తలెత్తి అతని కళ్ళల్లోకి చూసింది దిగులుగా, నీటి తెరలతో నిండివున్నాయి.

"ఎందుకలా బాధపడతారు చెప్పండి! మీరు బాగున్నంత కాలం నా కోసం కష్టపడలేదూ! ఏదో చిన్న కలత వచ్చి .... మీరు రెస్టు తీసుకున్నంతమాత్రాన ఇలా దిగులుపడొచ్చా. ప్లీజ్! వర్రీ అవకండి మరి నాకు టైం అవుతూంది వెళ్ళిరానా?"

అతను మౌనంగాతలూపాడు. వసంత గబగబా బైటికివచ్చి, రిక్షా పిలిచి "లగ్జరీ బార్ అండ్ రెస్టుహౌసు"కి పోనివ్వమని ఎక్కి కూర్చుంది. రాత్రితొమ్మిది కావస్తోంది. ఆ సమయంలో బార్ కి పోనివ్వమంటున్న వసంతను వాడు ఓసారి గుచ్చి చూశాడు. రిక్షా పది నిమిషాల్లో బార్ కి చేరింది. వసంతను చూడగానే గార్డెన్ బార్ లో కూర్చుని వివిధ రకాల హాట్ డ్రింక్సు సేవిస్తున్న అందరిలోనూ సంచలనం కలిగింది.

అందరూ ఓసారి చప్పట్లు కొట్టారు తెలీని ఆనందంతో. ఫ్రాన్సిస్ "డ్రమ్స్" మ్రోగించాడు ఉత్సాహంగా. కుమార్ "హలో" అన్నాడు మృదువుగా. మిగతా వాళ్ళు వాళ్ళ ఆర్కెస్ట్రా సరిచేసుకున్నారు. వసంత ఓ రెండు నిమిషాలాగి పాట మొదలుపెట్టింది.

"సరిగమపదనిసా.... అందిస్తా అమృతం కొట్టు గురూ" అంటూ. జనంలో కేరింతలు. చప్పట్లు జోరుగా



వినిపించాయి.

ఎవరో చీటీ తెచ్చి ఇచ్చారు. "ఏసో కోకా కోలా...." పాటపాడమనిఅందులో వుంది.

వసంత నిరుత్సాహపడింది. నిన్న తను వచ్చి పాటలు పాడటం మొదలు పెట్టిన అరగంటకు బోయ్ ఓ చీటీ తెచ్చి ఇచ్చాడు భయంభయంగా. అది చూసిన వసంత ఉలిక్కిపడింది.

"నీ గాన మాధుర్యంతో అందర్నీ పరవశుల్ని చేస్తున్నావు. యువర్ వాయిస్ యీజ్ వెరీ నైస్. స్వీట్ - బట్ ఐ వాంట్ యూ....ఓన్లీ వన్స్" సంతకం లేదు. తెచ్చిన బోయ్ కూడా అక్కడలేడు.

అక్కడేమీ రభస చేయకుండా వూరు కుంది. ఇంటికెళ్ళిన తర్వాత కూడా.... చాలాసేపు తనలో తనే ఏడ్చింది. అలాటి విషయాలు భర్తకి కూడా చెప్పటం మంచిది కాదనిపించింది.

• * •

పాపం మూర్తి! ఎంత మంచివ్యక్తి! కాలేజీలో చదువుకునేప్పుడు చాలామందిలా తను ప్రేమలో పడలేదు. తమది చాలా బీదకుటుంబం, మూర్తి తనంతట తాను వచ్చి వసంత తల్లిదండ్రుల్ని అడిగాడు. అతని కూడా ఎవరూ లేరు. తాలూకా ఆఫీసులో గుమాస్తా వుద్యోగం. మనిషి మంచివాడు. అతనితో జరిగిపోయింది వసంత పెళ్లి.

పెళ్ళయిన నాలుగేళ్ళవరకూ సంసారము సంతోషంగా గడిచిపోయింది. అలాంటి జంటల్ని చూడలేకేమో భగవంతుడు మూర్తి జీవితాన్ని నిరాశామయం చేశాడు. ఏదో క్యాంప్‌కి వెళ్లి వస్తున్న మూర్తి జీపులోంచి జారిపడి వెన్నెముక విరగ్గొట్టుకున్నాడు. కొన్నాళ్ళుపోయాక ఆపరేషన్ చేస్తామని, బాగవుతుందని చెప్పారు డాక్టర్లు. రెండేళ్ళనుంచి అతను ఇంట్లోనే వుంటున్నాడు. ఆపరేషన్‌కి ఐదువేలు ఖర్చవుతుందని విన్నప్పుడు వసంత గుండెల్లో రాయి పడింది.

తనెక్కడ్నుంచి తేగలదు అంత డబ్బు. తల్లిదండ్రులున్నా అంత స్తోమత లేదు వాళ్ళకు తనకి పెళ్లిచేసి "హమ్మయ్య" అనుకున్నారు ఆ తర్వాత అచ్చటా ముచ్చటా ఏమీలేదు.

దేవుడిచ్చిన వరంలా తన కంఠం తనని కాపాడింది బ్రతకటానికి. పది మంది తననివిమర్శించారుమూర్తినికూడా ఒప్పించి బార్‌లో పాటలు పాడి కాస్త సంపాదిస్తుంది తను. నీతిని, నిజాయితీని నమ్ముకుని బ్రతుకుతుంది

అక్కడ అనేక రకాల మనుషులుంటారు తాగి తందనా లాడుతూ నోటికి వచ్చింది వాగుతూ. వాళ్ళకెక్కిన కైపుని దిగనివ్వకుండా పాటలతో రంజింప జేయాలి తను. అలాటి పర్పసు కోసం సినిమా పాటలు కొన్ని ఎలానూ వున్నాయి. వాటిల్లోంచి సాధ్యమైనంత చెత్త పాటల్ని ఏరుకుని — కవిస్తూ పాడాలి.


"ఛ....ఏం బ్రతుకు!" అనుకుంది చాలాసార్లు. కానీ తప్పదు మరి.

• • •

బోయ్ నిన్న తెచ్చిన చీటీ మళ్ళీ ఇవాళ తెస్తే ఏం చేయాలి? తనలో తనే ప్రశ్నించుకుంది వసంత.

ఎందరో ఎన్నోసార్లు తనని కోరారు. కోరినంత డబ్బిస్తామన్నారు. తన అందం వాళ్ళని కైపెక్కిస్తోందన్నారు. పిచ్చి వాళ్ళు! తను బ్రతికేది తన భర్తకోసం. భర్తని బ్రతికించుకోవటం కోసం. ఇలాటి చోట పాటలుపాడి పదిమందిలో మాటలు పడటం గతిలేక!

ఈ మధ్య ఓ తెలుగు సినిమాలో భర్త కోసం వ్యభిచరించటం తప్పుకాదని చూపించారు. చాలా ఆలోచించింది




వసంత. అందుకే ఆ చీటీ మళ్ళీ వస్తుందేమోనని యీవాళ యింతగా ఎదురు చూడటం!

—ఎన్నో చీటీలు వచ్చాయి. అన్నీ పాటల కోసమే. నిన్న వచ్చిన బోయ్ వస్తున్నాడు. వసంత అతనివేపే చూస్తోంది పాడుతూ కూడా.

తనకి ఐదు వేలు సంపాదించాలంటే.... వేరే మార్గం లేదు....అయినా....చూద్దాం" అనుకుంది మనసులో! కుమార్, ఘంటశాల పాట "నిషా లేని నాడూ హుషారేమి లేదు,"—విషాదగీతం ఆలాపిస్తున్నాడు. శ్రోతలంతా మౌనంగా వింటున్నారు. అందరిలోనూ ఒకలాటి స్తబ్ధత ఆవరించింది,

బోయ్ దగ్గరికొచ్చాడు. భయంగా నిలబడ్డాడు. కళ్ళలో ప్రశ్నించింది ఏమిటని.

అతను తన చేతివంక చూసుకున్నాడు. వసంత చేయిచాపింది. కాగితం అందుకుంది.

"నీకోసం యెదురు చూస్తున్నాను కనికరించు! నా దగ్గర చాలా డబ్బుంది— అంతా నీకోసమే!" రూమ్ నెం. 37"—అని రాసుంది. బోయ్ వెళ్ళిపోయాడు. వసంత చీటీ నలిపి పారేసింది.

టైం చూసుకుంది. పదకొండయింది. వూరు సగం నిద్రపోయుంటుంది. పక్క వాళ్ళతో........ "తలనొప్పిగా వుంది, ఇంక నేను వెళ్ళొస్తా-" మానేజ్ చేసుకోమని రిక్వెస్టు చేసి ఓకె, అనిపించుకుంది.

గబగబా లేచి హాండ్ బాగ్ తీసుకుని హాల్లోకి వచ్చింది. అక్కడ ఎవరూ లేరు. కుడి పక్కగా మెట్లు కనిపించాయి. వేటూ రూమ్ నెం. 30-45 అని రాసుంది. మళ్ళీ ఓసారి అటూ ఇటూ చూసి గబగబా మెట్లెక్కింది.

గుండెలు కొట్టుకుంటున్నాయి! మనసంతా భయంతో నిండిపోయింది "మూర్తి ఆపరేషన్" కళ్ళముందు కదుల్తోంది సినిమాలో మాదిరి. అయినా యీ ఒక్కసారికే! ...

ముప్పయ్యేడు నెంబరు గది తలుపు తెరిచే వుంది. గభాలున లోపలికెళ్ళి తలుపు మూసేసింది ఒక్క క్షణం పాటు వూపిరి పీల్చుకుని.... మెల్లగా దృష్టి సారించింది.

అతను నవ్వుతూ సోఫాలో కూర్చుని వున్నాడు. కళ్ళు ఎర్రగా నిప్పుల్లా వున్నాయి. టీపాయ్ మీద ఖాళీ విస్కీ బాటిల్సు. అతను నిలబడబోయి.... తూలి కూర్చుండిపోయాడు.

వసంత దగ్గరికెళ్ళింది. మెల్లగా అతని పక్కన కూర్చుంది అతను చెయ్యేశాడు భుజం మీద. ఒళ్ళు గగుర్పాటుతో— అసహ్యం కూడా కలిగింది.

"ఎంతిస్తారు" అడిగింది. తెగించి!....

"ఎంత కావాలి" — ప్రశ్నించాడు ముద్ద మాటలతో.

—"ఐదువేలు"—

—"అహ్హహ్హా!"— అంటూ విరగబడి నవ్వాడతను.

—"ఏం చూసి....అంత డబ్బు! నువ్వొస్తావని తెలుసుగానీ.........నీ రేటు ఇంతని తెలీదు....సరే........ అడిగావు గాబట్టి ఐదువంద లిస్తాను....ఓకే......... కమాన్" అంటూ పైట లాగాడు.

"అసలు నీ దగ్గర డబ్బుందా"— ఏమిటో....అడిగేసింది వసంత.

అతను మళ్ళీ నవ్వి........లాకర్ లోంచి బ్రీఫ్‌కేస్ తెచ్చి మంచం మీద పెట్టాడు— తెరిచాడు. నివ్వెరపోయింది వసంత. అంత డబ్బు ఆమె ఏనాడూ చూసి వుండలేదు మరి!

—"ఓకే!"— అంది వసంత నవ్వు నటిస్తూ! అయినా ఆమె దృష్టంతా ఆ డబ్బుమీదే వుంది. అంత డబ్బు ఒక్కడే దాచుకోపోతే.... తనలాటి వాళ్ళకు సహాయం చేయకూడదూ!—" పిచ్చి ఆలోచన అనుకుంది.

అతను మరో రెండు బాటిల్సు తెచ్చి — ఓపెన్ చేశాడు. ఒక చేయి నడుంమీదవేసి, రెండో చేత్తో వసంత అందిస్తున్న గ్లాసులు ఖాళీ చేస్తున్నాడు. పదినిమిషాల్లో అవీ ఖాళీ అయిపోయాయి. ఏదో మాట్లాడాలని ప్రయత్నిస్తున్నాడు.

—"డియర్ .... నా దగ్గర.... బిస్కెట్లున్నాయ్.... తింటావా!"అంటూ అతి ప్రయత్నంమీద నవ్వుతూ అన్నాడు.

—"మాట్లాడవేం! మా మూలు బిస్కట్లుకాదు.... బంగారం బిస్కట్లు—" ఆ మాట పూర్తిచేయకముందే.... విరుచుకుని వెనక్కి పడిపోయాడు. రెండు చేతుల్తోనూ గుండె.... పట్టుకుని విలవిల్లాడుతున్నాడు.

ఉలిక్కిపడిందివసంత. అతన్నిచూసి ఏమవుతుందోనని భయం వేసింది. ఆ డబ్బు తన చేజిక్కించుకుంటే! తన భర్తని కాపాడుకోవచ్చు — అందుకు దొంగతనం. — "ఛ" అనిపించింది.

ఒక్క క్షణం ఆలోచించింది.

"భర్త కోసం వ్యభిచరించటం కన్నా.... దొంగతనం .... చాలా నయం" — అనిపించింది .. మళ్ళీ...

అతను స్పృహలేకుండాపడివున్నాడు—

చటుక్కున ఆ బ్రీఫ్ కేస్‌లో నోట్లు చిందర వందరగా సర్ది మూసేసింది. దాన్ని చేత్తో పట్టుకుని లేచింది. గుండె దడదడగా కొట్టుకుంటూంది భయంతో. ఒక్క అంగలో డోర్ దగ్గరికి చేరి విసురుగా దాన్ని తెరిచింది.

— గుండె ఆగినంత పనైంది వసంతకి.... ఎదురుగా పోలీసులు. చేతిలో బ్రీఫ్‌కేస్.... జారిపోయి — క్రిందపడి తెరుచుకుంది — నోట్ల కట్టలతోపాటు బంగారు బిస్కెట్లుకూడా మంటూ చెల్లా చెదురుగా పడిపోయాయి.

*